జగనన్న చేసిన మేలు మరువ వద్దు

- పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- మోసగాళ్లొస్తున్నారు...నమ్మకండి
- గడప గడపలో మంత్రి జోగి రమేష్

పెడన: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. పేదల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్న జగనన్నను మరువ వద్దని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని మడక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను, శాశ్వత భూ హక్కు రిజిస్టర్ డాక్యుమెంట్లను అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉదారంగా మేలు చేయాలనే దృఢ సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా రూ.2,750 పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనన్నారు. రాష్ట్రాభివృద్ధిని, అమలవుతున్న సంక్షేమ పథకాలు, గ్రామ స్థాయిలో అందుతున్న సేవలతో దేశం మన వైపు చూస్తోందని, అందుకు కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే అని చెప్పారు. మీరంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు.



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

అభివృద్ధి పనులకు రూ. 40 లక్షలు మంజూరు

మడక సచివాలయ పరిధిలో అభివృద్ధికి రూ.40 లక్షలు మంజూరవుతాయని, ఇప్పటికే ఫస్ట్ వార్డు ఏరియాలో రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చామని చెప్పారు. చిన్న బిడ్డల నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అసాధ్యం అనుకున్న వాటిని సుసాధ్యం చేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలు తీరుకు సంబంధించి ప్రతి ఒక్కరినీ కలిసేందుకు, వారి యోగ క్షేమాలు, సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి జోగి రమేష్ తెలిపారు. నేత్ర సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కట్ట కనక దుర్గారాజ్యంను విజయవాడ ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించాలని ఆరోగ్య కార్యకర్తకు, వలంటీర్ సౌజన్యకు మంత్రి జోగి రమేష్ ఆదేశించారు. అలాగే మడక చెరువుగట్టు ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించాలని ఏఈకి సూచించారు. మడక కాలనీ వాసులు మాట్లాడుతూ రోడ్డు, తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ముందుగా రోడ్డు నిర్మాణం చేపడతామని వారికి హామీ ఇచ్చారు. తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ కింద అవకాశం ఉంటే తప్పకుండా పరిష్కరిస్తానని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మడక సర్పంచ్ జోగి వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, సచివాలయాల జేసీ ఇన్‌చార్జి బెజవాడ నాగబాబు, గరికపాటి వెంకట రామానాయుడు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఎంఈఓ- 2 వైవీ హరినాథ్, ఈఓపీఆర్డీ ఎం. జయరామ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా జన్మాష్టమి వేడుకలు

నాగాయలంక: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత ఆలయ అర్చకుడు దీవి మురళీ ఆచార్యులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా సమాజం సభ్యులచే సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. మహిళలు ఆలయ ప్రాంగణంలోని జమ్మి చెట్టు వద్ద గోపూజ చేశారు. దేవాలయ ప్రాంగణంలో మండపం ఎదుట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్టి వేదికపై చిన్నారులు, భక్తులు కోలాహలంగా ఉట్టికొట్టి సందడి చేశారు. మండలంలోని భావదేవరపల్లి రామాలయంలోని శ్రీకృష్ణుడికి అర్చకుడు వరుల నాంచారయ్య బ్రహ్మత్వంలో విశేష పూజలు జరిపారు. సర్పంచి మండలి ఉదయభాస్కర్ పర్యవేక్షించారు. మర్రిపాలెంలోని పురాతనమైన శ్రీకృష్ణుని దేవస్థానంలో భక్తులు పూజలు చేశారు. గ్రామాల్లో పలువురు తల్లులు తమ చిన్నారులను బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి వారు చేసే సందడితో మురిసిపోయారు. రేమాల వారిపాలెంలో బాలిక ఖుషి కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించింది. ఆరు నెలల చిన్నారి హన్విక బాలకృష్ణుడిగా ముద్దులొలికించింది.

బందరు నగరంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉల్లాసంగా పాల్గొన్నారు. నగరంలోని రాజుపేట 37వ డివిజన్‌లోని సాయిబాబా గుడిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని విగ్రహం వద్ద పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జవ్వారుపేటలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పేర్ని కిట్టు, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు. చల్లరాస్తా సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో గోపూజలో మేయర్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. పేర్ని కిట్టును, మేయర్ వెంకటేశ్వరమ్మను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో 37వ డివిజన్ కార్పొరేటర్ ఐనం తాతారావు, యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లపాటి వెంకట్రావు, ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాగం ధర్మరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే శేషారావు, గాజుల భగవాన్, పాల సాయి, సమలం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బందరులో గోపూజలో పాల్గొన్న మేయర్ వెంకటేశ్వరమ్మ



అవనిగడ్డ కోర్టు ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకల్లో న్యాయమూర్తులు విజయకల్యాణి, గోపీనాథ్



బంటుమిల్లిలో ఉట్టి కొట్టేందుకు ప్రయత్నిస్తున్న చిన్నారులు



కృత్తివెన్ను గాంధీనగరంలో ఉట్టి కొట్టిన వారికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



బందరులో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న పేర్ని కిట్టు, కార్పొరేటర్లు



రేమాలవారిపాలెంలో కృష్ణుడు, గోపికగా చిన్నారి ఖుషి

కృత్తివెన్ను: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాలు జరిగాయి. ఉట్టి కొట్టే సమయంలో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పాల్గొని సందడి చేశారు. ఉట్టికొట్టిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కొన్ని చోట్ల బుధవారమే కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోగా.. మరొకొన్ని చోట్ల గురువారం నిర్వహించారు.

అవనిగడ్డ: స్థానిక కోర్టు ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి విజయ్ కల్యాణ్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎల్. గోపీనాథ్ కోర్టు ప్రాంగణంలోని కృష్ణుని ఆలయంలో శ్రీకృష్ణునికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం న్యాయ మూర్తులు, న్యాయవాదులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ తిమ్మన సుబ్బారావు, ఏపీపీ సీహెచ్‌వీకే ప్రసాద్, సీనియర్ వడ్డి రవీంద్ర, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండలంలో గ్రామగ్రామాన గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. వైష్ణవాలయాల్లో ఉదయం స్వామి వారి ప్రతిమలకు విశేష పూజలు, భగవద్గీత పారాయణలు నిర్వహించారు. పెదతుమ్మిడిలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఆలయంలో స్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. అర్తమూరు శివారు బాసినపాడు, చోరంపూడి పంచాయతీ శివారు వెంకటనారాయణపురం, ములపర్రు శివారు గొల్లగూడెం గ్రామాల్లో యువకులు ఉట్టి కొట్టారు. స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం భగవద్గీత పారాయణ, సాయంత్రం ఉట్టి కొట్టారు. కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో చిన్నారులు రాధాకృష్ణుల వేషదారణలో ఉట్టికొట్టి సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక గీతా మందిరంలో మండల ఆర్య వైశ్య మహిళా విభాగ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుని సన్నిధిలో గీతామృత పఠనం, 108 రకాల ప్రసాదాల నివేదన, ఊంజల్ సేవ, ఉట్టి వేడుక నిర్వహించారు. మహిళా విభాగ్ అధ్యక్షురాలు వరదా నాగమణి, ట్రెజరర్ పూరిమి దీప్తి, ఆర్య వైశ్య సంఘ పెద్దలు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్ పర్యవేక్షించారు.

పెడన: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు హరికృష్ణ వేణుగోపాలస్వామి వారికి ఉదయం విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. సాయంత్రం శ్రీ సత్యసాయి సేవా సమితి వారు స్వామి వారి సంకీర్తనలు, భగవద్గీత పారాయణం పఠించారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శివరామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి రూ.2.12 లక్షల విరాళం



రూ.1.11లక్షల నగదును అందిస్తున్న జనార్దనరావు కుటుంబ సభ్యులు



రూ.1.01లక్షల నగదును అందిస్తున్న దేవేంద్ర వరప్రసాద్ దంపతులు

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి ఇద్దరు దాతలు విరాళాలు అందించారు. కోడూరుకు చెందిన రైస్‌మిల్ వ్యాపారి అన్నం జనార్దనరావు (కిషోర్)-సుజాత దంపతులు రూ.1.11 లక్షలు, రిటైర్డ్ వీఆర్వో తుమ్మల దేవేంద్ర వరప్రసాద్-లక్ష్మీనరసమ్మ దంపతులు రూ.1.01లక్షల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు రూ.25 వేలు సాయం

అవనిగడ్డ: పులిగడ్డలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కేసన దానయ్య, సూరగం నాగమల్లికి రూ.25 వేల చెక్కును బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చెన్ను రంగారావు గురువారం అందజేశారు. మల్లేశ్వరం సర్పంచ్ చెన్ను శ్రీనివాసరావు, చెన్ను రంగారావు కలిపి రూ.15 వేలు విరాళం అందించగా, హైదరాబాద్‌కు చెందిన ఎస్ మ్యాక్స్ ఇంజినీరింగ్ ఇండియా రూ.5 వేలు, గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ సిస్టం అధినేత కొండా శ్రీరామ్‌రెడ్డి రూ.5 వేలు సమకూర్చారు. వాటిని రంగారావు, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అందె జగదీష్ చేతుల మీదుగా అందించారు.



అంగన్‌వాడీల్లో మెరుగైన సేవలు లక్ష్యం

ఐసీడీఎస్ సీడీపీఓ భానుమతి

చల్లపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ భానుమతి తెలిపారు. గురువారం స్థానిక పార్వతమ్మ తోటలో అద్దె ఇంటిలో గత ఇరవై ఏళ్లుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ పరిశీలించారు. సెంటర్ పరిధిలోని గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న ఇల్లు పాతది కావడం, ఎలుకలు పెరిగిపోవడంతో సరుకులు పాడవుతున్నట్లు తెలిపారు. మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం, దారి బురదమయంగా ఉన్న నేపథ్యంలో ఈ కేంద్రాన్ని సమీపంలోని వేరొక అద్దె ఇంటిలోకి మార్చుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత, దారి సక్రమంగా లేని నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు సమస్య లేకుండా అన్ని సౌకర్యాలు ఉన్న అద్దె భవనంలోకి ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చుతామని ప్రకటించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే వారికి ఆరోగ్యకర వాతావరణంలో మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సమావేశంలో చల్లపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, మహిళా పోలీస్ వేమూరి లావణ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ భానుమతి

అంగన్‌వాడీల్లో బలవర్ధకమైన ఆహారం

పెడన: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. గురువారం బల్లిపర్రు గ్రామ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి బల్లిపర్రు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (హెల్త్ వెలెనెస్ సెంటర్)లో పోషణ మహా మాసోత్సవం నిర్వహించారు. గర్భి ణులు, బాలింతలకు, చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు పలు సూచనలు చేశారు. సీహెచ్‌వో అరెపు హిమశ్రీ, ఏఎన్ఎం పి. ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

కోడూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు జరుగుతాయని ఎంఈఓ టీవీఎం రామదాసు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను పోటీల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలని ఎంఈఓ కోరారు. ఎంఈఓ-2 శ్రీనివాసరావు, హెచ్ఎం ఆలా వెంకటరమణ, మండల స్పోర్ట్స్ కన్వీనర్ ఎంఎస్ పెరుమాళ్లు, పీడీలు బీపీఎల్ ప్రసాద్, రామ్మోహనరావు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య పాల్గొన్నారు.

11 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

గూడూరు: మండల స్థాయి ఆటల పోటీలు, మండల స్థాయి జట్ల ఎంపిక ప్రక్రియ గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహిస్తామని మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మత్తి అరుణ తెలిపారు. 11వ తేదీ అండర్-14, అండర్-17 బాలుర విభాగం, 12న బాలికల విభాగం ఆటల పోటీలు ఉంటాయన్నారు. 2010 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అండర్-14 విభాగానికి అర్హులని చెప్పారు. 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అండర్-17 విభాగానికి అర్హులన్నారు. మండల స్థాయి జట్టుకు ఎంపికైన వారిని ఈనెల 20, 21 తేదీలలో జరిగే నియోజకవర్గ స్థాయి జట్టు సెలక్షన్స్‌కు పంపుతామని చెప్పారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కోనేరుసెంటర్: బైక్ చోరీపై మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం తరకటూరు గ్రామానికి చెందిన కాట్రగడ్డ వాసుసాయిరామకృష్ణ ఏడాది కిందట బందరు వచ్చి కాపురం ఉంటున్నాడు. పరాసుపేటలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటుండగా జూలై 26వ తేదీన ఇంటి ముందు పార్కు చేసిన ఉంచిన బుల్లెట్ బండిని గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. అప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోయింది. బైక్ చోరీపై బాధితుడు మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సర్పంచ్ శ్రీనివాసరావుకు పరామర్శ

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలులంక సర్పంచ్ చింతా శ్రీనివాసరావు ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు గురువారం పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ లంకె మస్తాన్, విశ్వనాథపల్లి వేణు, పూషడపు రత్నగోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి తెలిపారు. పాఠశాల అసెంబ్లీ ఆవరణలో గురువారం ఉదయం 520 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు అందించారు. హెచ్ఎం మాట్లాడుతూ చల్లపల్లికి చెందిన బల్లా శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో 320 మందికి, ఎన్ఎస్పీ అధినేత సానా నారాయణ రెడ్డి ఆర్థిక సహకారంతో 200 మంది విద్యార్థులకు బస్సు పాసులు ఇచ్చామని చెప్పారు.

కనుల పండువగా రుక్మిణీ కల్యాణం



అవనిగడ్డ: స్థానిక గీతా మందిరంలో రుక్మిణీ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలు, 108 కలశాలతో తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం రుక్మిణీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి ఏసీ సమర్పణ




మచిలీపట్నంటౌన్: స్థానిక చల్లరాస్తా సెంటర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయానికి మచిలీపట్నం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయగిరి సురేష్ కుమారుడు ఉదయగిరి పవన్‌నాగ్ గురువారం ఏసీని అందజేశారు. ఆలయ పూజారుల కోరిన మేరకు పవన్ నాగ్ రూ. 40 వేల విలువైన ఏసీని సమర్పించారు. దాతను పలువురు అభినందించారు.

దైవత్వంపై డాక్టరేట్ ప్రదానం



నాగాయలంక: స్థానిక షకీనా మినిస్ట్రీస్ నిర్వాహకురాలు పూషడపు ప్రభుకుమారికి దక్షిణ కొరియాకు చెందిన ఛాంగ్ హూంగ్ హోంగ్ చర్చి డయాసిస్ యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ డివైనిటీ ప్రకటించింది. ఈ మేరకు కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం నిడమర్రులోని యూనివర్సిటీ చర్చి డయాసిస్ సంస్థలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బిషప్ రాజాబాబు చేతుల మీదుగా ఆమె యూనివర్సిటీ అధికారిక డాక్టరేట్ పట్టా అందుకున్నారు. పట్టాతో పాటు ఆమెకు క్రైస్తవ వివాహాలు నిర్ధారించి రిజిస్ట్రేషన్ చేయించేందుకు అవసరమైన డయాసిస్ అధికారిక నియామక పత్రాన్ని కూడా యూనివర్సిటీ ప్రతినిధులు అందించారు.

దివ్యాంగులకు ఫిజియో థెరపీ



గూడూరు: దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న అనేక రుగ్మతలకు ఫిజియో థెరపీ చక్కటి పరిష్కారం చూపిస్తోందని గూడూరు ఎంఈఓ బి.ఎస్.సి. శేఖర్‌సింగ్ అన్నారు. ప్రపంచ ఫిజియో థెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గూడూరులోని నాన్ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ హుస్సేన్ దివ్యాంగులకు ఫిజియో థెరపీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, ఐఈఆర్టీ పి.రమాదేవి, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు కుంకుమ పూజలు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కుంకుమ పూజలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరానికి చెందిన మహిళా భక్తులు పెద్దఎత్తున కుంకుమ పూజల్లో పాల్గొంటారని చెప్పారు.

బందరు రూరల్ సీఐగా హబీబ్‌బాషా



కోనేరుసెంటర్/పెడన: బందరు రూరల్ సీఐగా మహమ్మద్ హబీబ్ బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన హబీబ్‌బాషా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. రాజమండ్రి ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన సీఐగా పదోన్నతి పొందారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మంత్రి జోగి రమేష్‌ను, జిల్లా ఎస్పీ పి. జాషువాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారు హబీబ్‌బాషాను అభినందించారు. కాగా ప్రస్తుతం రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్న వీరయ్యగౌడ్‌ను వీఆర్‌లో పెడుతూ డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు తీసుకున్న బాషాకు బందరు రూరల్ ఎస్ఐలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

హత్యాయత్నం కేసులో నిందితులను అరెస్ట్ చేయాలి

కోనేరుసెంటర్: బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో దళితుడు తలారి ఈశ్వరరావును కులం పేరుతో దూషించి హత్యాయత్నం చేసిన కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత బహుజన పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన నాగేశ్వరరావు ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో విషయాన్ని ఫోన్‌లో వివరించి ఎస్పీ సూచన మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. గత నెల 24వ తేదీన ఈశ్వరరావుపై హత్యాయత్నం జరిగిందని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా ఫలితం లేదని చెప్పారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు చేయగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ హామీ మేరకు దీక్షలను విరమించారన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు బాధితుడిని కేసు వాపసు తీసుకోవాలని, లేకుంటే చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. ఫిర్యాదుదారుడికి ఎలాంటి ప్రాణహాని జరగకుండా నిందితులను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొల్లూరి కోటేశ్వరరావు, యెగ్గోని గాంధీ, కొమరపల్లి థామస్, పీతల శ్యామ్‌కుమార్, గాలి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: పేదలను ఆదుకోవటమే తమ ఎంఈఐఎల్, ఎస్ఆర్ ఫౌండేషన్ ముఖ్యోద్దేశమని భూసమేత వేంకటేశ్వర దేవస్థాన వ్యవస్థాపకురాలు పురిటిపాటి సుధారెడ్డి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సి.ఎస్.ఆర్) కింద డోకిపర్రులో ఎంఈఐఎల్, ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మంది రోగులకు వైద్య పరీక్షలను చేసి ఉచితంగా మందులు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కోనేరుసెంటర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డీఈ భాస్కర్ అన్నారు. మచిలీపట్నం జ్యూవెలరీ పార్కులో గురువారం విద్యుత్ సమస్యలపై విద్యుత్ శాఖాధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోల్డ్‌గోల్డ్ వ్యాపారులు పలు సమస్యలను డీఈ దృష్టికి తీసుకువచ్చారు. లోటల్టేజీ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తూ విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జ్యూవెలరీ పార్కు అధ్యక్షుడు పీవీ సుబ్బారావు, పోతేపల్లి మాజీ ఎంపీటీసీ పిప్పళ్ల నాగబాబు, ఏఈ నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి డి. హారిక, జ్యూవెలరీ పార్కు సభ్యులు ఎస్వీ సుబ్బారావు, హరి, వీరబాబు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

పొట్లూరి లక్ష్మీ శైలజ, W/o. ప్రసాద్ (ఆధార్ : 6121 8174 5417), డోర్ నెం. 9-54, తాడిగడప గ్రామం, పెనమలూరు మం॥, కృష్ణాజిల్లా అను నాకు చెందిన ఒరిజినల్ దస్తావేజు డాక్యుమెంట్ నెం. 3337/2001, 28-12-2001 మా ఇంటి వద్ద నుండి బయలుదేరి కూచిపూడి గ్రామమునకు బస్సులో ప్రయాణం చేస్తుండగా మార్గమధ్యలో పోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు. సెల్ : 85559 31199. తగిన పారితోషికం ఇవ్వబడును